
నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 20 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




సర్పెంటీగల్



ఊలినెక్డ్ స్టార్క్

## పక్షుల వీక్షిస్తూ..

# కెమెరాల్లో బంధిస్తూ..

- కవ్వాల్, కాగజ్‌నగర్ ఫారెస్టులో ముగిసిన బర్డ్‌వాక్ ఫెస్టివల్
- తరలివచ్చిన పక్షి ప్రేమికులు

జన్నారం, జనవరి 19 : కవ్వాల్ అభయారణ్యంలోని జన్నారం డివిజన్ రేంజ్ పరిధిలో గల బైసన్‌కుంట అటవీ ప్రాంతంలో ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ సుష్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన బార్డ్ వాక్ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన 12మంది పక్షి ప్రేమికులు తరలివచ్చారు. ప్రకృతి అందాలతో పాటు పక్షులను వీక్షిస్తూ కెమెరాల్లో బంధించారు. ఈ ప్రాంతంలో దాదాపు 40 రకాల అరుదైన పక్షులు ఉన్నట్లు గుర్తించామని ఎఫ్ఆర్వో తెలిపారు. ఇక ఐఎఫ్ఎస్ అధికారి కుమారి చిన్న ఇందన్‌పెల్లి రేంజ్‌లోని బద్దన్‌పేట,కామన్‌పెల్లి, మైసమ్మకుంట, ఘనిశెట్టికుంట ప్రాంతాలను ఆదివారం పరిశీలించారు. వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట రేంజ్ ఆఫీసర్ కారం శ్రీనివాస్ ఉన్నారు.

కాగజ్‌నగర్, జనవరి 18 : కాగజ్‌నగర్ మండలం కోసిని డ్యామ్, వెంపల్లిలో శనివారం ప్రారంభమైన బర్డ్‌వాక్ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రివాల్, కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుఖ్‌దేవ్ బోబడే, పక్షి ప్రేమికులు అడవుల్లో కలియదిరిగి పక్షులను వీక్షించారు. కెమెరాలు, సెల్ ఫోన్‌లలో వాటిని చిత్రీకరించారు. పక్షులకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉందని, రెండు రోజుల్లో దాదాపు 100 పక్షులు వలస వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా బర్డ్‌వాక్ ఫెస్టివల్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు రమాదేవి,శశిధర్ బాబు పాల్గొన్నారు.



జన్నారం : ఇందన్‌పెల్లి రేంజ్ అడవుల్లో ఐఎఫ్ఎస్ అధికారి కుమారి చిన్న



పక్షులను కెమెరాలో చిత్రీకరిస్తున్న పక్షి ప్రేమికుడు

## నేటి నుంచి విద్యుత్ ఆర్టిసన్స్ రిలే దీక్షలు



ఎస్ఈకి వినతిపత్రం అందించిన ఆర్టిసన్స్ (ఫైల్)

మంచిర్యాలటౌన్, జనవరి 19 : విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిసన్ కార్మికులు ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఎస్ఈకి మూడు రోజుల క్రితం వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆర్టిసన్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్స్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలకు పిలుపునిచ్చారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న 20 వేల మంది ఆర్టిసన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ అనేక పోరాటాలు చేశామని, కన్వర్షన్ వల్ల సంస్థకు పెద్దగా భారంకూడా ఉండదని, అయినా రాష్ట్ర ప్రభుత్వం గానీ, యాజమాన్యంగానీ ఇప్పటి వరకు స్పందించడం లేదని, దీంతో రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు రిలే దీక్షలు చేపడుతున్నట్లు జిల్లా చైర్మన్ పసుల తిరుపతి, కన్వీనర్ తోట నగేశ్, సెక్రటరీ దేవేందర్, శ్రీనివాస్, ఉస్మాన్, గొర్రె రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



అర్ధాంతరంగా నిలిచిన చెన్నూర్ బస్ డిపో పనులు

# చెన్నూర్ బస్‌డిపోకు మొండి చేయి

## కేసీఆర్ సర్కారులో మంజూరు చేయించిన మాజీ విప్ బాల్క సుమన్

- ప్రభుత్వం మారడంతో ఎక్కడికక్కడ నిలిచిన పనులు
- ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో ఊసెత్తని వైనం
- స్థానిక ప్రజల్లో నిరాశ.. నిరసన
- ఎమ్మెల్యే వివేక్ ఏం చేస్తున్నాడంటూ అసహనం

చెన్నూర్, జనవరి 19 : కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త బస్ డిపోల ఏర్పాటుపై కీలక నిర్ణయాలు తీసుకోగా, చెన్నూర్ బస్ డిపోకు మాత్రం మొండిచేయి చూపింది. చెన్నూర్‌లో బస్ డిపో కావాలని ఎప్పటి నుంచో ఈ ప్రాంత ప్రజలు కోరుతుండగా, కేసీఆర్ ప్రభుత్వంలో అప్పటి విప్ బాల్క సుమన్ ప్రత్యేక చొరవతో ముందడుగు పడింది. బస్ డిపో ఏర్పాటుకు పట్టణ సమీపంలో నాలుగెకరాలు కేటాయించడమేగాక రూ. 4 కోట్లు మంజూరు చేయించారు. ఈ మేరకు 2023, జూలై 30న బస్ డిపో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శాసన సభ ఎన్నికల వరకు పనులు శరవేగంగా సాగాయి. ప్రహరీతో పాటు డిపోకు అవసరమైన భవనాలు, షెడ్ల పనులకు సంబంధించి ఫౌండేషన్లు పూర్తయ్యాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పనులన్నీ నిలిచిపోయాయి. ఆర్టీసీ అధికారులు సంబంధిత కంట్రాక్టర్‌కు పనులు నిలివేయాలని ఆదేశించనట్లు సమాచారం. ప్రహరీతో పాటు గ్యారేజ్, కార్యాలయ భవనాలు, వాషింగ్ ప్లాట్ ఫాం, ఆయిల్ స్టోర్ రూం, సెక్యూరిటీ రూం, మరుగు దొడ్లవంటి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా, ఇప్పటి వరకు ప్రహరీ మాత్రమే పూర్తయ్యింది. ఇక మిగతా పనులకు సంబంధించి ఫౌండేషన్ నిర్మాణాలు పూర్తయ్యాయి. ఎన్నికలకు ముందులాగే పనులు జరిగితే ఆరేడు నెలల క్రితమే బస్ డిపో నిర్మాణం పూర్తయ్యేది. ఇక్కడి నుంచి సమీపంలోని పల్లెలు, పట్టణాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటుతో కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి బస్సులు నడిచేవి. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిగేది. కానీ కాంగ్రెస్ సర్కారు పుణ్యమాని ఈ ప్రాంత ప్రజలకు నిరాశే మిగులుతున్నది.

### బోర్డు సమావేశంలో చెన్నూర్ డిపో ఊసెత్తని వైనం

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పెద్దపల్లిలో బస్ డిపో నిర్మాణం కోసం రూ 11.70 కోట్లు, ఏటూరునాగారంలో కొత్తగా బస్ డిపో నిర్మాణం కోసం రూ 6.28కోట్లు, ములుగులో కొత్తగా బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ 5.11 కోట్లు, హుజూర్‌నగర్‌లో కొత్తగా బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ 3.75 కోట్లు, మధిరలో ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ.10 కోట్లు, మంగపేటలో కొత్తగా బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ .51 లక్షలు, మంథని బస్‌స్టేషన్ విస్తరణ కోసం రూ 95 లక్షలు, కోదాడలో ఆధునిక బస్‌స్టేషన్ నిర్మాణం కోసం రూ.17.95 కోట్లు, కాళేశ్వరంలో ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ. 3.95 కోట్లు మంజూరు చేసింది. ఇటీవల హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో జరిగిన బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కానీ, కేసీఆర్ సర్కారులో మంజూరైన చెన్నూర్ బస్ డిపో గురించి మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాగా, ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మాత్రం చెన్నూర్ బస్ డిపో నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని మాట్లాడారు. అయినప్పటికీ బోర్డు సమావేశంలో చెన్నూర్ బస్ డిపో ప్రస్తావన రాకపోవడంపై ఈ ప్రాంత ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. శాసన సభ ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారిన తర్వాత కొంత మంది కోర్టుకెళ్లి స్టే తీసుక రావడంతో పనులు నిలిపి వేయడం జరిగిందని అధికారులు చెబుతుండగా, దానిని తొలగించేందుకు ఎందుకు కృషి చేయడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే వివేక్ ఎందుకు చొరవతీసుకోవడం లేదంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.



బస్ డిపో పనులు ప్రారంభిస్తున్న బాల్క సుమన్ (ఫైల్)

# పెట్టుబడి సాయానికి కత్తెర..!

## రైతు భరోసా అమలుకు అనేక ఆంక్షలు

- ఈ సమయంలో సర్వే చేస్తే కనిపించేవన్నీ ఖాళీ భూములే..
- లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో రైతు భరోసా లబ్ధిదారులు గణనీయంగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ సర్కారు ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రైతుబంధు అమలు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హుల గుర్తింపు పేరిట సర్వే నిర్వహిస్తూ లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఇప్పటి వరకు రెండుసార్లు అమలు చేయాల్సిన రైతుబంధు (రైతు భరోసా) కనీసం ఒక్కసారి కూడా అమలు చేసింది లేదు. బీఆర్ఎస్ పాలనలో రైతుబంధు ద్వారా దాదాపు లక్షా 23 వేల మందికి ప్రయోజనం చేకూరగా, ఈసారి లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి.



సర్వే తీరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంటేశ్‌ధోత్రే

### సాగులో ఉన్న భూములకే రైతు భరోసా!

కాగజ్‌నగర్‌లో నిర్వహిస్తున్న సర్వేను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే.. కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతు భరోసా పథకానికి ఎలాంటి భూములు ఎంపిక చేయాలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతుభరోసా పథకంలో భాగంగా సాగుకు యోగ్యంకాని భూములను తొలగించాలని, సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా అందించేలా జాబితా రూపొందించాలని సూచించారు. రాళ్లు, గుట్టలు, నివాస గృహాలు, వెంచర్లు, లే అవుట్లు, అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం సేకరించిన భూములు, ఇరిగేషన్ భూములు, చెరువులు, కాలువలు, రహదారులు, రైల్వే లైన్ల కోసం కేటాయించిన స్థలాలను రైతు భరోసా జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం వానకాలం పంటల సీజన్ ముగిసింది. సాగునీటి సౌకర్యం లేక యాసంగి పంటలు వేసేందుకు చాలా మంది రైతులు ముందుకు రావడం లేదు. ఈ లెక్కన క్షేత్రస్థాయిలో సర్వేచేపడితే పంటలు వేయని భూములే ఎక్కువగా దర్శనమిస్తాయి. దీంతో పంటలు వేయని భూములను రైతు భరోసా పథకం నుంచి తొలగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ఫలాలు అర్హులందరికీ అందేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. అర్హుల జాబితా రూపొందించి గ్రామసభల్లో చదివి వినిపించాలని తెలిపారు. అర్హత గలవారు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు.

# డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 19 : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం, పీజీ హెచ్ఎం అసోసియేషన్-2025 క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదివారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే సంఘం యొక్క ప్రధాన కర్తవ్యం కావాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, మడావి గోపాల్, పీజీ హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూర్కా ఉద్దవ్, ప్రధాన కార్యదర్శి నైతం కృష్ణారావ్, ప్రసాద్, హెడ్ మాస్టర్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు అశోక్, నాయకులు వెడ్మ యస్వంత్, కూడ్మేత అనంత్, కొట్నాక్ యాదవ్ రావ్, రవీందర్ పర్చాకి హన్మంత్‌రావు, కుడ్మేత జంగు పెందోర్ భీంరావ్, కుంరం భీము, పెందోర్ విశ్వేశర్, జాదవ్ ప్రఫుల్, ఆత్రం పెంటయ్య, నాంపల్లి లక్ష్మీనారాయణ, సుర్పం రవీందర్, జర్పుల విజేష్, మధు, కొడప సురేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# బస్టాండు కిటకిట

- సంక్రాంతికి వచ్చి తిరుగుపయనమైన ప్రజలు
- ప్రయాణికులతో పెరిగిన రద్దీ
- అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- సిబ్బందికి ప్రోత్సాహకాలు

మంచిర్యాలటౌన్, జనవరి 19 : సంక్రాంతి పండుగ సెలవులకు వచ్చిన వారంతా తిరుగు పయనం కాగా, మంచిర్యాల ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. పట్టణాల్లో పనిచేసే ప్రభుత్వ, ప్రవేట్ ఉద్యోగులతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు బస్టాండ్‌కు చేరుకొని తిరిగి వెళ్తుండగా, ఎక్కడ చూసినా రద్దీయే కనిపించింది. ఇందుకనుగుణంగా సిబ్బంది ఏర్పాట్లు చేసింది. మంచిర్యాల నుంచి గోదావరిఖ ని, చెన్నూరు, లక్షెట్టిపేట, బెల్లంపల్లి కేంద్రాలకు అదనంగా బస్సులు నడిపిస్తున్నారు. దీంతో పాటు ప్రధానంగా ఆదాయం సమకూరే హైదరాబాద్ రూట్‌లో అత్యధిక సంఖ్యలో బస్సు లు కేటాయించారు. జనరల్ సర్వీసులతో పాటు రిజర్వేషన్ సర్వీసులు యథావిధిగా నడుపుతుండగా, రద్దీ దృష్ట్యా 25 ప్రత్యేక సర్వీసులు నడిపిస్తున్నారు. ఈ సర్వీసుల్లో మాత్రం అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. గడిచిన మూడు రోజులుగా రోజుకి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. రోజుకి రూ.31 లక్షలు వస్తుందని అధికారులు అంచనా వేసినప్పటికీ మరో రూ.తొమ్మిది లక్షలు ఎక్కువగా వసూలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసి సిబ్బందికి సంస్థ ప్రోత్సాహకాలను ప్రకటించింది. కిలోమీటరుకు రూ.మూడు చొప్పున ఇన్సెంటివ్‌లను అందజేస్తున్నది. ఉదాహరణకు రోజులో100 కిలో మీటర్లు బస్సు నడిపిస్తే డ్రైవర్‌కు రూ.300, కండక్టర్‌కు రూ. 300 వెంటనే ఇస్తున్నామని డీఎం జనార్దన్ తెలిపారు.



మంచిర్యాల బస్టాండులో ప్రయాణికుల రద్దీ



రోడ్డుపైకి మురుగు నీరు రావడంతో ప్రమాదకరంగా సర్వాయిపేట-నాగంపేట రోడ్డు

# పట్టు తప్పితే అంతే..

కోటపల్లి మండలంలోని సర్వాయిపేట-నాగంపేట గ్రామానికి వెళ్లే రోడ్డు ప్రమాదక రంగా మారింది. సర్వాయిపేట గ్రామ చివరలో ఉన్న ఈ రోడ్డుపైకి ఇళ్ల లోని మురుగు నీరుతో పాటు మిషన్ భగీరథ నీరు చేరుతున్నది. మొత్తం బురదమయ మవడంతో ఈ రూట్లో ప్రయాణించే వారు పట్టుతప్పి పడిపోతున్నారు. ఇటీవల పలువురు గాయపడ్డారు. ఇకనైనా అధికారులు చొరవ తీసు కొని ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

- కోటపల్లి, జనవరి 19

# కేసీఆర్ పట్టాలిచ్చి ఆదుకుంటే.. రేవంత్ సర్కారు కనీసం లోన్‌లు ఇస్తలేదు

- టైగర్ జోన్ పేరిట మానిక్ పటార్‌ను తరలిస్తే ఊరుకోం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, జనవరి 19 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పోడు భూములకు పట్టాలిచ్చి, రైతుబంధు, రైతుబీమా పథకాల ద్వారా రైతులను ఆదుకుంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనీసం లోన్‌లు కూడా ఇవ్వడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. ఆదివారం కాగజ్‌నగర్ మండలం మానిక్ పటార్ గ్రామంలో పర్యటించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానిక్ పటార్ 1950 నుంచి గుర్తించబడిన గ్రామంగా ఉందని, 70 ఏళ్లుగా ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు కనీసం ఇళ్లు లేవని, ఇక్కడ కనీస వసతులు కల్పించకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం ఆ గ్రామాన్ని టైగర్ రిజర్వ్ ప్రాంతంగా పరిగణిస్తూ తరలించాలని కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుమ్రం భీం ఉద్యమ కాలం నుంచి ఈ గ్రామం ఉందని, ఇప్పుడు ప్రజలంతా ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. గ్రామాన్ని తరలించాలని చూస్తే ఊరుకోబోమని, భీం స్ఫూర్తితో పోరాడుతామని హెచ్చరించారు. ఆదివాసుల హక్కులు కాలరాయాలని చూస్తే ఎక్కడికక్కడ ఫారెస్టు అధికారులను నిలదీస్తామన్నారు. అనంతరం కాగజ్‌నగర్ పట్టణంలో క్రికెట్, ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబచిరిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శివప్రసాద్, మాజీ కౌన్సిలర్ బాల్క శ్యాం, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్